చిన్నసంసారం

శ్రీ పంతుల కృష్ణారావు

సాయంత్రం సత్యనారాయణ ఆఫీసునుంచి వచ్చేసరికి ఇంట్లో అతని తమ్ముడి భార్య శకుంతల కన్పించింది. ఆమెను చూడగానే సత్యనారాయణకి చాల వరకు ఆందోళన తగ్గింది. మూడురోజుల నుంచి అతను ఆమె విషయమే భార్య నడుగుతున్నాడు. వారం రోజులై శకుంతల రావడం లేదు. ఆమె రాకపోతే తమ్ముడూ భార్యా ఇంట్లో యేం ఇబ్బందులు పడుతున్నారో అన్న భయమే మొదట ఆవరిస్తుంది సత్యనారాయణని.

సత్యనారాయణ తమ్ముడు ఆ ఊళ్ళోనే ఒక కర్రల డిపోలో గుమస్తాగా పనిచేస్తూ నెలకి నలభై రూపాయిలు తెచ్చుకుంటున్నాడు. అక్కడే ఎనిమిది రూపాయిల అద్దెకి వేరే ఒక యిల్లుతీసుకొని భార్యతో ఆయింట్లోవుంటున్నాడు. అతనికి ఆ నలభైరూపాయిలే ఆధారం. మరేమీ పైరాబడికూడా లేదు. వచ్చేజీతంలో ఇంటద్దెపోగా మిగిలేదానితో ఆభార్యాభర్తా నెలల్లా గడపాలి! — ముప్ఫయ్‌రెండురూపాయిలతో ఇద్దరు మనుషులు నెలరోజులు గడపడం కష్టమే! — ఇందుకే సత్యనారాయణ తమ్ముడి సంసారాన్ని చూసి చాలా విచారిస్తూవుంటాడు.

అయితే తమ్ముణ్ణిగురించి అంత విచారించి, జాలిపడి సత్యనారాయణ అతనిబాధల్ని ఏమేనా నివారించగలుగుతున్నాడా అంటే లేదనే చెప్పాలి! అసలు తమ్ముడి సంసారకష్టాన్ని రూపుమాపే శక్తి సత్యనారాయణకీ లేదు. సత్యనారాయణకూడా గుమస్తాయే! అయితే జీతంమాత్రం నెలకి నూరురూపాయిలు. కాని పదిహేనురూపాయిలు ఇంటద్దె చెల్లించగా మిగిలిన ఎనభైయైదురూపాయిలతో తనూ భార్యా యేం ఇబ్బందులు పడకుండా నెలరోజులు కాలక్షేపం చేయడం అతనికీ బ్రహ్మాండంగానే వుంది. అప్పటికీ సత్యనారాయణ తమ్ముడికి చేయగలిగిన సహాయమంతా శక్తివంచన లేకుండా చేస్తూనేవున్నాడు. శేషగిరికి అందిన నలభై రూపాయిలు ఆ భార్యాభర్తలు పదిహేనురోజులు కాలక్షేపంచేయడానికి సరిపోతాయి. మిగిలినపదిహేను రోజులు ఏరోజుకారోజు వెతుక్కోవడమేఅవుతోంది. అటువంటప్పుడు సత్యనారాయణ ప్రతినెలా తమ్ముడికి అయిదూ పది సర్దుబాటుచేసి, అతని ఇంట్లో లేని సామానులు తనఇంటిలోనుంచియిచ్చిసహాయపడుతూనే వున్నాడు. అయినా ఒక్కొక్కరోజున ఇంట్లో భోజనాలు లేకుండావున్నటు వింటున్నాడు. అవును మరి! వందరూపాయిలు సంపాదిస్తున్నతనకే ఆజీతంతో సంసారం నిర్వహించడం అంత సుఖం కానప్పుడు నలభైరూపాయి తో సంసారం చెయ్యడం తనతమ్ముడి కెంతకష్టం? తనెంత సహాయంచేస్తే అతనికి ఈబాధలు తప్పుతాయి?

సత్యనారాయణ లోనికి వెళ్లాడు. ఆ యింటికి రెండే గదులు, ఒకదాని ప్రక్క ఒకటి ఉన్నాయి. అందులో ఒకటి వంటకి భోజనాలకి; రెండవది పడక గది. రెండుగదులద్వారాన్ని కలుపుతూ చిన్నవరండా, వరండా దాటితే చిన్న గచ్చువాకలి, ఆవాకిలి దాటితే వీథిద్వారం!

సత్యనారాయణ వెళ్ళేసరికి అతని భార్య, తమ్ముడిభార్య, పడకగది ద్వారందగ్గర వరండాలో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. సత్యనారాయణ రావడం చూచి తమ్ముడి భార్య లేచి నిల్చొని, "వెళతా నక్కయ్యా!" అంది. "అప్పుడే వెళతానంటావేమమ్మా!—వచ్చి ఎంతసేపయింది కనుక?—ఓ ఘడియ కూర్చొని వెళిపోదువుగాని!" అంది సత్యనారాయణ భార్య. "లేదక్కయ్యా!—ఇంకా వంటచేయాలి! చాలా పనులున్నాయి. మళ్ళీ వస్తాను!" అంది శకుంతల. "ఏది? అనడమే కాని కన్పించడమే లేదు! వస్తూ వుండమ్మా!—నువ్వు రాకపోతే మీ సంగతులేమీ తెలియక మాకాందోళనగా వుంటుంది!" అంది సత్యనారాయణభార్య ఆమెను సాగనంపుతూ. "అలాగే అక్కయ్యా!" అంది శకుంతల.

ఇంట్లోకివెళ్ళిన సత్యనారాయణ గదిద్వారం దగ్గరనుంచి ఇద్దరు ఆడవాళ్ళూ అడంలేచిపోగానే తిన్నగా గదిలోకిపోయి ఆలోచిస్తూ కుర్చీలో కూర్చున్నాడు. అతని కళ్ళముందు శకుంతల ఆకారమే మెదులుతోంది. ఆమెను తలుచుకున్నప్పుడల్లా సత్యనారాయణకి ఆమెమీద అమితమైనజాలి వేస్తూ వుంటుంది. క్రిందటిసారి వచ్చినప్పటికి ఇప్పటికి చాలా నీరసించినట్టు కన్పిస్తోంది. శకుంతల వారం రోజులక్రిందట వచ్చినప్పుడు ముఖం యింత వాడిపోయి లేదు. ఈసారి మరీ కాంతిహీనంగా వుంది ముఖం. పాపం!—తన తమ్ముడితో ఎన్ని బాధలు పడుతోందో యేమిటో!—కట్టుకున్న చీరా, తొడుగుకున్న జాకెట్టు చాలా మాసిపోయి వున్నాయి. బట్టలు కూడా లేనట్టున్నాయి. తమ్ముడిని పెళ్ళాడినది మొదలు ఆపిల్లకి అన్నీ కష్టాలేకాని సుఖం అన్నది లేకుండావుంది. కాని తన తమ్ముడు మాత్రం యేం చేయగలడు?—భార్యకి చీరలు కొనలేడు, ఇంట్లోకి నెలకి సరిపడ్డ సామాను తేలేడు అంటే నలభైరూపాయిల జీతం తెచ్చుకుంటూ వాడేం తేగలడు?—ఇంకా ఈ మాత్రం ఉద్యోగం దొరకబట్టే ఈపాటేనా నిలవగలుగుతున్నారు. లేకపోతే ఆ చదివిన సెకండుఫారం చదువుకి ఈమాత్రం ఆధారమేనా దొరుకుతుందనుకున్నాడా తను?—అయితే అందుకని వాడి కర్మ వాడనుభవిస్తాడంటూ తను ఊరుకోగలడా అంటే ఊరుకోలేడు. చిన్నప్పుడు చదువుకోనందుకు తనిప్పుడు శేషగిరిని చూచి విసుక్కోడు. పైగా అతనిలాగ తయారయాడని ఎవరేనా అతనిని అన్నా తను సహించడు.

సత్యనారాయణ అలాగే ఆలోచిస్తూ కూర్చున్నాడు. భార్య కప్పుతో కాఫీ తెచ్చి టేబిల్‌మీద వుంచింది. కాని సత్యనారాయణ అది గమనించనే లేదు.

“కాఫీ చల్లారిపోతోందండి!” అని హెచ్చరించింది భార్య. సత్యనారాయణ భార్యవంక చూశాడు. ఆమె తెలుపు ఆకుపచ్చరంగులు గల కనకాంబరం రంగుచీర, తెల్లనివాయిల్ జాకెట్టు ధరించింది. మెళ్లో పుస్తెలతాడుకాక మూడుపేటల బంగారపు గొలుసు, చెవులకు రాళ్ళ తమ్మెట్లు, చేతులకు ఒక్కొక్క బంగారపుగాజు వున్నాయి. ముఖం సబ్బుతో కడుగుకొని పల్చగా పౌడరు రాసుకొని వుంది. కళ్ళకి కాటుకవుంది. తలలో మల్లెపువ్వులు పరిమళాన్ని వెదజల్లుతున్నాయ్. సత్యనారాయణ భార్యవంక చూస్తూ ఆమె అనుభవిస్తూన్న జీవితానికీ, తన తమ్ముడిభార్య అనుభవిస్తూన్న జీవితానికీ గల వ్యత్యాసాన్ని గురించి ఆలోచించసాగాడు. తన భార్య చూస్తే ఇంతనీటుగా ముస్తాబై మనసులో ఏ చీకూచింతా లేకుండావుంది. అటు తన తమ్ముడిభార్య మెళ్ళో నల్లపూసలసరు తప్పించి మరో ఆభరణం లేక, కట్టుకుందుకు మంచిబట్టయినా లేక ఒక్కొక్క రోజున తినడానికి తిండికూడా లేక నానాబాధలూ పడుతోంది. ఐశ్వర్యం అనుభవించలేకపోయినా దేనికీ ఇబ్బంది పడకుండా ఉన్నదానితో సుఖంగానే సాగిపోతోంది తన సంసారం. అటు తన తమ్ముడి సంసారం చూస్తే ఇంట్లో ఏ వస్తువూ లేక ప్రతిదానికి ఇబ్బంది పడుతూ ఏరోజుకారోజు ఎలా సాగుతుందా అన్నట్టుగావుంది. ఊరినిండా అప్పులైపోయి తీర్చలేక నానాబాధలు పడుతున్నాడతను.

సత్యనారాయణ ఇంకా అలాగే కూర్చోవడం చూచి, “కాఫీ చల్లారిపోతోందండీ!” అని మరోసారి జ్ఞాపకంచేసింది భార్య.

సత్యనారాయణ కాఫీ త్రాగేసి ఖాళీకప్పు టేబిల్‌మీద వుంచాడు.

ఇంటికొచ్చినప్పట్నుంచి భర్త తనతో మాటాడకుండా ఆలోచిస్తూ కూర్చోవడంచూసి, “ఏమిటండీ ఇంటికొచ్చిన దగ్గర్నుంచి అంతతీవ్రంగా ఆలోచిస్తున్నారు?” అని అడిగింది భార్య సత్యనారాయణ కెదురుగావున్న కుర్చీలో కూర్చుంటూ.

“ఉహూఁ!—ఏమీ లేదు!” అన్నాడు సత్యనారాయణ.

“ఏమీ లేకపోతే ఆఫీసునుంచి వచ్చినది మొదలు మాటాడకుండా ఎందుకిలా కూర్చున్నారు?” అని ప్రశ్నించింది భార్య.

“మరేం లేదు. మా తమ్ముడి సంసారంగురించే!—ఇవాళ శకుంత లొచ్చిందికదా, ఇంట్లో ఎలా కాలక్షేపం చేస్తున్నారో ఎలావుంటున్నారో తెలిసిందేమో అని!”

“తెలియకపోవడానికి ఏమంత రహస్యం కనకనా?—ఎలాగ కాలక్షేపం అవుతోందో అందరికీ

తెలుసుగా? ఇంత కాలం ఎలావుంటున్నారో ఇప్పుడూ అలాగే వుంటున్నారు. కాని అంతకంటే మరేమీ సుఖపడిపోలేరు...ఇవాళొచ్చి మళ్ళీ ఇంట్లో ఏ వస్తువూ లేదంటే రెండుసేర్ల బియ్యం. పావుసేరు కందిపప్పూ, పావుసేరునూనె ఇచ్చాను!" అంది భార్య.

సత్యనారాయణ భారంగా ఒక నిట్టూర్పు విడిచాడు.

"అయినా ఇంత అధ్వాన్నం యేమిటండీ?—అంతకూన్నమ?—ఈ నెలలో ఇప్పటికి అప్పుడే రెండేసిసేర్ల బియ్యం మూడుసార్లిచ్చాను. పంచదార నాలుగుసార్లిచ్చాను. నూనె మూడుమారులొచ్చి పట్టుకెళ్ళింది. పప్పులూ, ఉప్పులూ లెఖ్ఖ లేదు!" అంది భార్య.

భార్య ఇలాగ అంటూంటే సత్యనారాయణ కళ్ళలో దైన్యమయమైన శకుంతల స్వరూపం మెదిలి మనస్సు చివుక్కుమంది.

"పాపం!—ఆపిల్ల యేంచేస్తుంది రాజ్యం?—మనం కాకపోతే వాళ్ళకి ఈస్థితిలో మరెవ్వరు సాయం చేస్తారు?—మనతో కాకపోతే ఆ అమ్మాయి ఇంకెవ్వరితో చెప్పుకుంటుంది?—నా జీతం మనిద్దరికీ చాలడమే బ్రహ్మాండంగా వుందని కాని లేకపోతే వాళ్ళూ మనం కలిసి ఒక్క కుటుంబంగా వుండవలసిన మాట!—వాళ్ళని చూసి మనమే ఇలా విసుక్కుంటే తక్కిన వాళ్ళంతా ఎంత హీనంగా చూస్తారు?" అని అన్నాడు.

తనన్న మాటలవల్ల భర్త బాధపడినట్లు గ్రహించి మళ్ళీ అంది రాజ్యం. "ఛా!—నేనా అమ్మాయి నేమీ అనడంలేదండీ!—పాపం, ఆపిల్లేంచేస్తుంది?—అందుక్కాదు!—మీ తమ్ముడిమాట చెబుతున్నాను!—ఇంట్లోకి కావలసిన వస్తువులు తేకపోతే ఆడది ఎలాగ సంసారం చేస్తుందండీ?—ఏమి తెమ్మన్నా "నాదగ్గర డబ్బులేదు. నన్నేంచేయమన్నావ్?" అంటాడట!—అలాగని ఊరుకోకుండా వేళకి భోజనం అమర్చకపోతే నానా తిట్లూ తిడతాడట!—ఈ సంగతే చెప్పుకొని 'నేనీ సంసారం ఎలాగ చేసేదక్కా!' అంటూ యేడ్చింది పాపం శకుంతల."

"అవును రాజ్యం, వాడివంటే వాడుమాత్రం ఏంచేయగలడు?"

"మగవాడు చేయలేకపోతే ఇంట్లోవున్న ఆడది చేస్తుందిటండీ?—ఏ సామానూ లేకపోతే రోజూ ఎన్నిళ్ళకని అప్పులకి తిరుగుతుంది పాపం ఆ పిల్ల?"

"నిజమే!—అయితే నలభై రూపాయల రాబడితో ఎవడుమాత్రం ఇంతకంటే చేయగలడో చెప్పు!"

సత్యనారాయణ ఈ మాటనడంతో, "ఇప్పుడు తనూ భార్యా వున్నప్పుడే ఇలాగ సంసారం చేస్తున్న మనిషి రేపొద్దున్న పిల్లా పాపా పుడితే ఇంకేం చేస్తాడండీ?" అని అడిగింది రాజ్యం.

తన తమ్ముడి పరిస్థితుల నర్థంచేసుకోకుండా భార్య ఇలాగ తేలికగా మాటాడడం సత్యనారాయణకి కొంచెం కష్టాన్ని కలిగించింది. శేషగిరి ఇప్పుడీ పరిస్థితుల కెలాగవచ్చాడో సత్యనారాయణకి తెలుసు. అందుచేతనే శేషగిరి ఇప్పుడు సంసారం చేయలేకపోతున్నాడంటే అతనిని సత్యనారాయణ కోపగించుకోడు. హీనంగా చూడడు. పైగా అతని నెవ్వరేమన్నా తను బాధపడతాడు. భార్య అన్నమాటలకి కొంచెం కోపంతో అన్నాడు సత్యనారాయణ:

"నువ్వన్నవన్నీ నిజమే రాజ్యం!—అయితే వాడుమాత్రం యేంచేయగలడంటాను. దొరికినంత కాలం ఊరినిండా అప్పులుకూడా చేసేసి రవ్వంత లోటు రానీయకుండా చేశాడు. ఇప్పుడెవ్వడూ అప్పివ్వడంలేదు; ఏ దుకాణంవాడూ అరువివ్వడంలేదు. ఇంక ఎలా చేస్తాడు?"

భర్త ఇలాగ అనడంతో రాజ్యం ఏమీ అనలేక ఊరుకుంది. రెండునిముషాలు ఊరుకున్నాక మళ్ళీ అంది:

"పాపం, శకుంతలని చూస్తే ఎంతో జాలివేస్తోందండీ!—ఆ కట్టుకున్న బట్టలూ ఆ మనిషీ ఎలావుందో చూశారా?—రెండేరెండు చీరలున్నాయిట. అందులో ఒకటి రెండు మూడుచోట్ల చిరిగిపోయిందిట కూడాను!"

"ఆపిల్ల అవస్థలుకూడా చూస్తున్నాను రాజ్యం!" భారంగా నిట్టూరుస్తూ అన్నాడు సత్యనారాయణ.

"మొన్న పండగనాడు చీరకొనుక్కొమ్మని ఎనిమిదిరూపాయిలిచ్చామా?—ఆ డబ్బు ఇంటిక్రిందే ఖర్చయిపోయిందట!" అంది రాజ్యం.

"మనం పొరపాటు చేశాం. డబ్బివ్వకుండా చీరె కొనిచ్చెయ్యవలసింది!"

"అదే!— అయినా రానురాను మరీ దిగవార్చుకు పోతున్నారండీ!— ఎవ్వరికీ దమ్మిడీయేనా బాకీ తీర్చడం లేదుట. వాళ్లింతా రోజూ వచ్చి దీనిని అనరాని మాటలనడంట!"

"........,........................"

"పోనీ దీనిపైన మరో పదో పదిహేనో దొరికే మరొక చిన్నపని ఎక్కడైనా చూసినా బాగుణ్ణు!"

"హుం!— సెకెండుఫారం చదివినవాడికి పనెవడిస్తాడు రాజ్యం?— ఇదేనా ఆ పావు కొలువు తెలిసినవాడు కొట్టి పీడినుంచుకున్నాడు."

"అయినా ఇతను చదువుకోక పోవడమేమండీ? స్కూలు ఫైనలైనా అయితే మీలాగ నూరురూపాయిల ఉద్యోగమేనా దొరుకునా?"

"చదువుకోకపోవడమేమండీ అంటే నేనొకటి చెపాను విను!— వీడు చదువుకోకుండా తిరిగినది జ్ఞానంలేని వయస్సులో. దాని ఫలితాన్ననుభవిస్తున్నది ఇప్పుడు. ఇప్పుడు తనన్ని బాధలు పడవలసి వుంటుందన్న జ్ఞానమే వుంటే అప్పుడలాగ తిరిగేవాడే కాడు. ఏమనిషీ కోరి. తనంతటతాను బాధల్ని తెచ్చుకొని అనుభవించడు."

సత్యనారాయణ ఈమాటవనగానే రాజ్యం అంది: "మీరన్ని ఇలాగే చెప్తారండీ!— చిన్నప్పుడు చదువుకోకుండా తిరగడం అతనితప్పుకాదు; పెద్దయాక ఇప్పుడు పెళ్లాన్ని కొల్పుకుతినడమూ అతని తప్పుకాదు!— మీ తమ్ముడుకదూ?— అంచేత అతను చేసినవాటిని సమర్థిస్తూ వుండండి!"

భార్య అన్నమాటకి నిముషంసేపు ఊరుకొని, కుర్చీలో సరిగా సర్దుకు కూర్చొని గంభీరంగా అన్నాడు సత్యనారాయణ:

"రాజ్యం, నువ్విలాగంటున్నావు. చిన్నప్పుడు చదువుకోలేదని, పెద్దవాడయాక భార్యని సుఖపెట్టలేదని నువ్వు మా తమ్ముడిని ఇన్నిమాటలంటున్నావు కాని వాడెటువంటి పరిస్థితులవల్ల ఎటువంటి పరిసర ప్రభావంవల్ల ఈవిధంగా తయారయాడో ఆలోచించడం లేదు. చెబుతున్నాను విను!— మా తమ్ముడు ఇప్పుడీస్థితికి వచ్చాడంటే అందులో వాడి నేరం ఏమీ లేదు!"

రాజ్యం భర్తముఖంవంక చూస్తూ మాట్లాడక కూర్చుంది. సత్యనారాయణ చెప్పసాగడు.

"శేషగిరి తెలివితక్కువవాడు కాడు. వాడికి నాకంటే మంచి తెలివితేటలున్నాయి. మంచి జ్ఞాపకశక్తి గ్రహింపుశక్తి వున్నాయి. అయితే ఎన్నుంటే ఏం లాభం?— అవన్నీ ఎందుకూ పనికి రాకుండా పోయాయి అన్నీ ఉన్నా చదువంటే యేమీ శ్రద్ధవుండేదికాదు మా తమ్ముడికి. అప్పుడు చిన్నతనం. ఎంతసేపూ బడి మానేసి చెట్లూ చేమలూ ఎక్కి ఆడుకుందాం అన్న ఆలోచనే కాని, దానివల్ల ఎటువంటి నష్టాలు వస్తాయో తెలిసుకుని వయస్సు. దానికితోడు చదువుకోమ్మని, బడికి వెళ్లమని ఎవరూ నిర్బంధించేవారు కారు. మా అమ్మ నాన్న ఉన్నారంటే వాళ్లదొక రకం. మా అమ్మకి నేనన్నా, మా తమ్ముడన్నా ఊరంత ముద్దు. మా అమ్మకి ఎనమండుగురం పుట్టేం. అందులో ఆరుగురు చనిపోగా మేమిద్దరం మిగిలేం. నేను నాలుగోవాడిని, వాడు ఆఖరువాడు. అందుచేత బడికి వెళ్లకపోయినా, ఎంత అల్లరిచేసినా, ఎలాగ తిరిగినా ఏమీ అనేదికాదు. ఇంక మా నాన్నగారు ఉన్నారంటే ఆయనకి ఇంటి విషయాలేమీ అవసరం వుండేవికావు. తన కవసరంలేని ఇతరుల పనులన్నిటిని నెత్తిని వేసుకొని క్షణం ఇంటిదగ్గర ఉండకుండా తిరిగేవారు కాని తనయింట్లో ఏం జరుగుతున్నా, ఎవరెలా వున్నా పట్టించుకొనేవారు కారు. అసలు మాకు మొదట్లో వున్న పాతిక వేల రూపాయల ఆస్తీ ఆయన ఇటువంటి వాటికి వినియోగించడంచేతనే ఎర్రని యేగాని అయినా మిగలకుండా పోయింది. ఊరినిండా అప్పులైపోయి ఆస్తి అంతా నేను ఏడేళ్లవాడినై ఉన్నప్పుడే వేలం వేయబడింది. మళ్ళీ ఆయనవల్ల మహోపకారంపొందిన వాళ్లే మాఆస్తి వేలం వేయించారు. కాని మాటంటే ఆయన ఒప్పేవారు కారు. విషభుజంగాల్ని, నరరూప రాక్షసుల్ని చేరదీయడంచేతనే ఆయనా స్థితికి వచ్చారంటే చాలా కోపగించుకొనేవారు. ఆస్తి పోయాక మా నాన్న చాలా చిక్కుల్లో పడ్డారు. బడిపంతులు పనివల్ల వచ్చే నలభై రూపాయలతోను సంసారం వెళ్లడం

చాలా కష్టమైపోతుండేది. వచ్చిన జీతం చాలక ఇలాగే ఊరినిండా అప్పులు చేయవలసి వచ్చేది. వాడుకల వాళ్లకి బాకీలు తీర్చక అవి నెల నెలకి పెరిగిపోతూ వుండేవి. వాళ్లంతా ఇంటిమీద పడి నానామాటలూ అంటూండేవారు. అయితే అటువంటి పరిస్థితులలో కూడా మా నాన్నకి ఇంటి విషయాలలో శ్రద్ధవుండేది కాదు. ఆస్తిపోయి అవస్థలు పడుతూన్నప్పటికి ఆయన తల మీద బాధ్యతలు వేసేవాళ్ళుమాత్రం వదలలేదు. ఆయన కింత అపకారం చేసినవాళ్ళే మళ్లీ ఏదో పని ఆయన ద్వారా జరిపించుకోడానికని వస్తూవుండేవారు. ఇలాగ ఆయనకెప్పుడూ ఇతరుల విషయాలలో నే కాని, ఇంటి విషయాలలో ఏమీ శ్రద్ధవుండేది కాదు. ఇలాగ మా తమ్ముడి చదువు విషయంలో మా అమ్మా నాన్నా కూడా శ్రద్ధ తీసుకోలేదు. అదే వాడిని ఇప్పటి స్థితికి తెచ్చిపెట్టింది. వాడెప్పుడూ చెట్టెక్కి ఆడడం, చెరువులో దిగి ఈదడంలో చూపే శ్రద్ధ చదువులో చూపేవాడు కాడు. పుస్తకం పట్టుకోడం, బడికి వెళ్లడమంటె గండంలాగ వుండేది వాడికి. మూడొంతుల కాలం ఏదో మిషతో బడి మానేసేవాడు. అయితే మూడొంతుల కాలం బడికి వెళ్లకపోయినా, ఏనాడూ పుస్తకం పట్టుకు చదవకపోయినా ఆ వెళ్లినప్పుడు బడిలో చెప్పగా విన్నదే జ్ఞాపకం వుంచుకొని, పరీక్షలలో వ్రాయగా పదిహేను, ఇరవై, పాతికా మార్కులు వస్తూండేవి. కాని ఆమార్కులతో ఎలా పాసవుతాడు? అందుచేత మధ్యమధ్య ఒక్కొక్క క్లాసు రెండేసి సంవత్సరాలు చదవవలసొచ్చేది. అప్పుడేనా మా అమ్మా, నాన్నా వాడిని మందలించి శ్రద్ధగా చదువుకొమ్మని, బడికి వెళ్లమని చెప్పేవారు కారు. వాడిని విచ్చలవిడిగా వదిలేశారు. కొంచెం శ్రద్ధవహించి చెప్పకపోతే ఆ వయస్సులో వాడికేమిటి తెలుస్తుంది? అమ్మా నాన్నా ఉన్నారుకదా నాకేం లోటు? అని అనుకుంటాడే గాని వాళ్లెల్లకాలం వుండరని, ఉన్నా తనని పోషించలేరని, పెద్దయాక తన స్వశక్తిమీదే తను బ్రతకవలసి వుంటుందని, ఇన్ని బాధలుంటాయని వాడికప్పుడేం తెలుసు? అలాగ తెలుసుకొని వుంటే ఇప్పటి స్థితికే రాకపోను!"

సత్యనారాయణ కొంచెం ఆగాడు. కుర్చీలో బద్ధకంగా చేరబడ్డాడు.

"సరే, ఎలాగైతేనేం మధ్యమధ్య ఒక్కొక్క క్లాసు రెండేసేళ్ళు చదువుతూ పద్నాలుగేళ్లకు సెకండుఫారంలోకి వచ్చాడు. సెకండుఫారంలోకి వచ్చాక మా తమ్ముడికింక చదవడం అంటే పూర్తిగా బద్ధకం ఏర్పడింది. స్కూలుకి వెళ్లడం అంటే ఇష్టం లేకపోయింది. ఒకరోజున మా అమ్మతో తనకింక చదవాలని లేదని, స్కూలు మానేస్తానని అన్నాడు మా తమ్ముడు. ఈ సంగతి మా అమ్మ మా నాన్నగారితో చెప్పింది. మా నాన్నగారు మా తమ్ముడిని పిలిచి, "చదువు మానేసి ఏమిటి చేస్తావురా?" అని అడిగారు. "ఏదైనా ఉద్యోగం చేస్తాను నాన్నా!" అన్నాడు మా తమ్ముడు. "నీకే ఉద్యోగం దొరుకుతుందిరా?" అన్నారు మా నాన్న. "ఏది దొరుకుతే అదే చేస్తాను. నేను ఇంక చదవలేను!" అన్నాడు మా తమ్ముడు. అంతే!—అలాంటప్పుడు మా నాన్న గట్టిగా చెప్పాలా? అదేమీ లేకుండా ఆయన ఊరుకున్నారు. దానితో వాడు చదువుకి స్వస్తి చెప్పేశాడు. చదువు మానేశాక ఇంక ఉద్యోగం చేస్తానని బయల్దేరాడు మా తమ్ముడు. కాని రెండవ ఫారం చదివిన వాడికి ఎక్కడేం ఉద్యోగం దొరుకుతుంది?—రోల్డుగోల్డు నగలమ్మే ఏజంటుగా కొంతకాలం, ఏదో మందులమ్ముతూ కొంతకాలం తిరిగాడు. కాని వాటివల్ల పాతిక ముప్ఫయ్ రూపాయిలకంటే ఎక్కువ వచ్చేదికాదు. అప్పటికి నువ్వు వచ్చావు వాడి సంపాదనా అదీ నువ్వూ చూసే వుంటావు. ఆస్థితిలో వాడికి పెళ్లి ఒకటి తలపెట్టారు. ఎవడికో ఒకడికి చెల్లెల్నిచ్చి మూడు ముళ్ళూ వేయించి తన బాధ్యత ఒదుల్చుకుందామని చూస్తున్న ఈ శి౦తల అన్నగారు అప్పుడు తన చెల్లెల్ని మా తమ్ముడికిస్తానంటూ మా నాన్నతో చెప్పొచ్చాడు. ఆయనతో మాట్లాడాడు. మా నాన్నగారు కూడా రెండవ మాట అనకుండా ఒప్పేసుకున్నారు. దాని ఫలితంగా వీళ్లిద్దరికి పెళ్ళి జరిగిపోయింది. వాడి పెళ్లయిన తర్వాత ఏడాదిలోనే మా అమ్మా నాన్నా మూడు మాసాల వ్యత్యాసంలో చనిపోయారు. ఆ తర్వాత ఈ కరువు ఎక్కువై వస్తువుల ధరలన్నీ పెరిగిపోవడంచేత వాడప్పుడు సంపాదిస్తూండే ముప్ఫయ్ రూపాయిలతోను, నేను తెచ్చేజీతంతోను ఇరవై రూపాయిల ఇంటద్దె చెల్లిస్తూ నలుగురు మనుషులం జీవించడానికి సరిపోకపోవడంచేత వాళ్ళూ మనం వేరయిపోవడం జరిగింది. అప్పటినుంచి వాళ్ల సంసారం ఇలాగే వుంది. ఆ మందులమ్మే పనికంటే ఈ డిపో గుమస్తా ఉద్యోగం అయితే మరొక పది రూపాయిలు ఎక్కువ దొరుకుతాయని, స్థిరంగా ఈ ఊళ్ళో వుండవచ్చునని నాకు

తెలిసిన షావుకారుతో చెప్పి ఈ పని యిప్పించాను. అయినా వాడిస్థితి అలాగే వుంది ఊళ్ళో చూస్తే విపరీతంగా అప్పులు పెరిగిపోయి వున్నాయి. ఇంట్లో చూస్తాంటే అన్నిటికీ ఇబ్బందిపడుతున్నారు. సరిగ్గా తినడానికి తిండీ, కట్టుకోడానికి బట్టా కూడా లేక వాడూ ఆ పిల్లా పడరాని అవస్థలన్నీ పడుతున్నారు. ఇంత చిన్న వయస్సులోనే వాళ్ళిద్దరి జీవితాలకి సుఖం లేకుండా పోతోంది."

సత్యనారాయణ తను చెప్పేదంతా అయిపోయిందన్నట్టుగా భారంగా ఊపిరి వదిలి కుర్చీలో చేరబడ్డాడు. రాజ్యం ఒక అయిదు నిముషాలు ఏదో ఆలోచిస్తూ అలాగే కదలకుండా కూర్చుంది. ఆ తర్వాత ఇలాగ అంది:

"అయితే ఇంతకీ మీరు అనేదేమిటే అంటే మీ తమ్ముడికి చిన్నతనంలో ఎవ్వరూ చెప్పకుండా వదిలేయడంచేతనే అత నిప్పుడీ స్థితికి వచ్చాడంటారు. అయినా అతనికా వివేకం వుండాలికాని ఒకరు చెబితే తెలుస్తుందిటండీ?—చెప్పినా వింటాడా?"

సత్యనారాయణ అన్నాడు:

"రాజ్యం, నువ్విలాగంటావని నాకు తెలుసు. అయితే నేను చెప్పవలసినది ఇంకా పూర్తి కాలేదు. చెప్పేదంతా పూర్తిగా విని తర్వాత సందేహాలు తీర్చుకో!—ఎవరి వివేకం వారికుండాలి కాని ఒకరు చెప్పినందువల్ల తెలుస్తుందా? వింటారా? అన్నావు. చిన్నతనంలో పద్నాలుగు పదిహేనేళ్ళవాడికి, మొదట్నుంచీ ఏ కష్టాలూ ఎరుగకుండా తల్లిదండ్రులచాటున గారాబంతో పెరిగినవాడికి తను చదువుకోవాలనీ, చదువుకోకపోతే తను పెద్దవాడయాక ఉద్యోగం దొరకదనీ, ఉద్యోగం లేకపోతే పెళ్ళాన్ని పిల్లల్ని పోషించడం కష్టమని ఇవన్నీ ఏం తెలుస్తాయి?—ఇంక వినడం మాటా?—మొదట్లో ఏ పిల్లలకైనా చదువు, బడి అంటే భయంగానే వుంటుంది. అయిష్టంగానే వుంటుంది. అలాగని చెప్పి ఊరుకుంటే వాళ్ళెందుకు పనికొస్తారు?—చిన్నతనం చేత వాళ్ళకి తెలియక బడికి వెళ్ళను చదువుకోను అన్నప్పటికి పెద్దవాళ్ళన్నవాళ్ళు వాళ్ళకి బోధపరచాలి. వాళ్ళు వినకపోతే కాస్త కఠినంగానైనా ప్రవర్తించాలి. మొదట్లో కొద్దికాలం అది వాళ్ళకి బాధగా అనిపించినా తర్వాత తర్వాత వాళ్ళంతట వాళ్ళే తెలుసుకొని దారిలో పడతారు. చెప్పకపోతే అనుభవించేవరకు ఇటువంటి విషయాలు తెలియవు... ఇంతెందుకు తలవెంట్రుకవాసిలో తప్పిపోయింది కాని లేకపోతే నే నీనాడు ఈమాత్రం ఉద్యోగం అయి ఈ మోస్తరుగా నేనా ఉండగలిగేవాడినా?—నువ్వు ఈపాటి మంచిబట్టలు కట్టుకొని ఇంత నీటుగా ముస్తాబై ఇంత నిర్విచారంగా ఉండగలిగేదానివా?—మన సంసారం కూడా మా తమ్ముడి సంసారంలాగే వుండును!"

రాజ్యం ఊపిరి బిగపట్టుకొని వినసాగింది. సత్యనారాయణ చెప్పాడు.

"పన్నెండేళ్ళవరకు నేను కూడా వాడిలాగే చదువూ సంధ్యా లేకుండా తోటలమ్మట, దొడ్లమ్మట తిరిగినవాణ్ణే!—అప్పుడు చిన్నతనం!—ఇప్పుడున్నంత జ్ఞానం అప్పుడెక్కడ?—ఎంతసేపూ ఏ తోటలో చెట్లెక్కి ఆడుదామా, ఏ చెరువులో దిగి యీదుదామా అనే కాని చదువుకుందాం బడికి వెళదాం అన్న ఆలోచన ఉండేదికాదు. దీనికితోడు ఎన్ని రోజులు బడికి వెళ్ళకపోయినా మా అమ్మ ముద్దుచేత, మా నాన్నగారు స్వంతవిషయాల్లో ఆయనకున్న ఉపేక్షాభావంచేత వెళ్ళమని చెప్పేవారు కారు. నేను మూడునెలల కాలం బడికి వెళ్ళేవాడిని కాదు. ఇంటి దగ్గరైనా చదువుకొనేవాడిని కాను. ఎప్పుడూ ఇంటి దగ్గర మాత్రం ఉండకుండా తిరుగుతూ వుండేవాడిని తోటలంటా, చెరువులంటా."

"ఇలాగ వుండగా మా అమ్మఅన్నగారు ఒకసారి మా యింటికి వచ్చాడు. ఆయన కలెక్టరు కోర్టులో హెడ్ గుమాస్తాగా పనిచేస్తూ వుండేవాడు. ఆయన సంతానం అయిదుగురు కొడుకులు. ముగ్గురు కూతుళ్ళు. వారంతా ఇప్పుడూ ఉన్నారు. పెద్ద కొడుకు డాక్టరు, రెండవ కొడుకు వకీలు; అప్పటికి మూడోవాడు ఇంజనీరింగు, నాలుగవవాడు ఎం. ఎస్ సి, అయిదవ కొడుకు బి. కాం చదువుతూవుండేవారు. కూతుళ్ళలో ఇద్దరు కొడుకుల తర్వాత పుట్టిన పెద్ద కూతురు అయిదో ఫారంవరకు చదివి మానేసి పెళ్ళయి కాపురం చేస్తూవుండేది. ఆమె భర్త తాసీల్దారుగా వుండేవాడు. తర్వాత ఇద్దరు కూతుళ్ళూ మగపిల్లలందరి తర్వాత పుట్టినవాళ్ళు. రెండవ కూతురు అయిదవ ఫారం, మూడవ కూతురు మూడవ ఫారం చదువుతూ వుండేవారు.—ఆయన మా యింటికి వచ్చాడు. పరిస్థి

తులన్నీ చూశాడు. ఇంటిమీదపడి అప్పులవాళ్ళు అన రాని మాట లంటున్నా, ఇంట్లో వస్తువులు లేవని మాఅమ్మ చెబుతున్నా, నేను చదువు సంధ్యలు లేక పాడైపోయి తిరుగుతున్నా, తన కేమీ సంబంధం లేదన్నట్టుగా వున్న మా నాన్నగారి ధోరణిని చూసి చాలా ఆశ్చర్యపడ్డాడు. కోపంకూడా వచ్చింది. మా నాన్నకి శ్రద్ధలేకపోయినా తినేనా అతనికి గట్టిగా చెప్పనందుకు మా అమ్మని మందలించాడు. నే నింక మరి అక్కడుంటే దమ్మిడీకికూడా పనికి రాకుండా పాడవుతానని, తన వద్దకు పంపించేస్తే మంచి క్రమ శిక్షణలోవుంచి రస్తాలోకి తీసుకొస్తానని చెప్పి నన్ను వాళ్ళ యింటికి తీసుకొనిపోయాడు."

"మా మామయ్య చాలా ఖచ్చితమైన మనిషి. పద్ధతైనవాడు. అతను ఏర్పరచిన పద్ధతుల ప్రకారం అందరూ నడుచుకుంటూ వుండాలి!—పిల్లలందరికీ ఆయనంటే హడల్! అంత పెద్ద డాక్టరు ఉద్యోగం చేస్తూండే పెద్దవాడికి, వకీలుగా ప్రాక్టీసు పెట్టుకొని అంతపేరూ, రాబడీ వున్న రెండవవాడికికూడా పెళ్ళిళ్ళయి పిలల తండ్రులైనప్పటికీ తండ్రి అంటే గౌరవం, భయం రెండూ వుండేవి. ఆయన అన్న మాటకు వారుకూడా ఎదురు చెప్పే వారుకారు. ఆయన పిల్లలికి కొన్ని పద్ధతు లేర్పరిచాడు. ఆరుగంట లయేసరికి నిద్రలేవాలి! ఇలాటివాటిలో మామూలుగా నే వుండే వాడు. కొంతమంది పెద్దలు కాఫీ పిల్లలకి అలవాటు చేస్తే పాడైపోతారని దగ్గర పిల్లలున్నా వారికివ్వ కుండా తాము మాత్రం తాగేస్తారు. కాని మా మామయ్య రూల్స్‌లో కాఫీ నిషేధంకాదు. ఉదయం ఏడు గంటలకి కాఫీ, సాయంకాలం నాలుగు గంటలకి కాఫీ, ఏదో ఫలహారం రోజూ వుండేవి. ఉదయం కాఫీ అయాక పదిగంటలవరకు ఎవరి పను లలో వారుండేవారు. పది గంటలకి భోజనం చేసి, కాలేజీలకి కొందరు, హైస్కూళ్ళకి కొందరు వెళ్ళి పోయేవారు. మామయ్య రెండో కొడుకు కోర్టుకు వెళ్ళిపోయేవాడు. పెద్దవాడికి ఆస్పత్రి ఉదయం ఏడు న్నరనుంచి పదిగంటలవరకు, మధ్యాహ్నం మూడు న్నరనుంచి అయిదున్నరవరకు ఉండేది. మిగతా వేళల్లో ఆయన ఇంటిదగ్గరే వుండేవాడు. నేను అక్కడ అప్పటికింకా ఏ స్కూల్లోను చేరలేదు. ఇంటిదగర నాకు బాగా ట్యూషన్ చెప్పి ఆ మీదటికి హైస్కూల్లో మొదటి ఫారంలో చేర్పించాలని మామయ్య ఉద్దేశం. నాకప్పటికి ఇంగ్లీషు అక్షరాలు మాత్రం వచ్చాయి. మానాలు, ఎక్కాలుకూడా బాగా వచ్చేవికావు.

"సాయంకాలం కాలేజీలనుంచీ, హైస్కూళ్ళ నుంచీ వచ్చాక కాఫీ టిఫిను అయాక మగ పిల్లలంతా అలాగే షికార్లుకని వీధిలోకి వెళ్ళేవారు. ఏడున్నర వరకు తిరిగి ఏడున్నగా అయేసరికి భోజనాలకివచ్చే వారు. భోజనాలయాక ఎవరి గదులలో వారు కూర్చొని పదిగంటలవరకు చదువుకొనేవారు. పది గంటలకి అంత మందీ నిద్రపోయేవారు. ఇదే వాళ్ళింట్లో పిల్లల కేర్పర చిన పద్ధతి. అంతమంది ఈ పద్ధతి ప్రకారమే నడిచే వారు. అయితే ఇంత పద్ధతిగావున్నా ఆయన పిల్లల కెంతవరకు స్వేచ్ఛ అవసరమో అంతవరకు ఇచ్చే వాడు. వాళ్ళ సరదాలన్నీ తీర్చేవాడు. చూడవలసిన సినిమాకాని, నాటకంకాని, సర్కసుకాని వచ్చిం దంటే ఆ బాలగోపాలాన్ని తోడుకొని వెళ్ళేవాడు. ఇంట్లో ఎవ్వరికీ రవ్వంతలోటు రానిచ్చేవాడు కాడు. కాని ఎవ్వరికి మంచి మార్కులు రాకపోయినా, చదువులో అశ్రద్ధ వహించినా అగ్గిరుగ్గుడైపోయే వాడు. "వెధవా! ఇప్పుడు చదువుకోకపోతే ఆ తర్వాత ముష్టెత్తుకోడానికే కాని మరెందుకూ పనికి రావురా!" అంటూ తిట్టేవాడు. నాకు మొదట్లో ఆ పద్ధతులన్నీ చాలా బాధగా వుండేవి. వెళ్ళిన మర్నాటి నుంచీ ఆయన నన్ను చాలా కట్టుదిట్టంలో వుంచాడు. నన్నెక్కడికీ కదలనిచ్చేవాడు కాడు. చదువుతేకాని ఒప్పేవాడు కాడు. మా ఊళ్ళో ఉన్నప్పుడు చెరువు లంట, తోటలంట, ఇష్టం వచ్చినట్టు తిరిగే నాకు మా మామయ్య చేసిన కట్టుబాట్లు చాలా కష్టంగా వుండేవి. నాకా యిల్లు అప్పట్లో ఖైదులాగే అగుపించేది. ఆయన ఒక్కొక్క రోజున చదువుకోకపోతే గట్టిగా కసిరేవాడు. నాకప్పుడు లోలోపల ఎంతేనా దుఃఖం వచ్చేది. కాని ఇప్పుడు ఆలోచిస్తుంటే ఆ పద్ధతులెంత మంచివో తెలుస్తోంది. నాకు ఆ యేడాదంతా బాగా ట్యూషన్ చెప్పి హైస్కూలో మొదటి ఫారంలో చేరేలాగ చేసే బాధ్యత తన పిల్లలందరిమీద వేశాడు మా మామయ్య. నాకు కొద్దిరోజుల్లోనే మానాలు, ఎక్కాలు పూర్తిగా వచ్చేశాయి. అప్పటినుంచి నాకు ఆ ఇంటందరూ ట్యూషను చెప్పడం ఆరంభించారు. ఎవరికి తీరిక వున్నప్పుడు వారు నాకు లెఖ్కల్లోను, తెలుగు, ఇంగ్లీషు, హిస్టరీ, జాగ్రఫీ, సైన్సు మొదలగు

వాటన్నిటిలోను పాఠాలు చెప్పేవారు. ముఖ్యంగా నాలుగవవాడు, అయిదవవాడు నాకు చెబుతూ వుండేవారు. ఒక్కొక్కప్పుడు మా మామయ్య కూతుళ్ళుకూడా చెప్పేవారు. మా మామయ్య రెండవకూతురు నాకంటె ఏణ్ణర్ధం పెద్ద. మూడవ పిల్ల ఆరుమాసాలు చిన్న. ఆ అమ్మాయిల్ని చూస్తుంటే నాకెంతో సిగ్గువేసేది. నాకప్పుడప్పుడే జ్ఞానోదయం అవుతోంది. ఆ ఆడపిల్లలు నాకంటె పెద్ద క్లాసులు చదవడం, నాకు ట్యూషన్ చెప్పడం చిన్నతనంగా అనిపించసాగింది. వాళ్ళంతా అలాగ పెద్ద పెద్ద క్లాసులు చదువుతూంటె నేనింకా మొదట్లోనే వుండడం చాలా తలవంపు అనిపించేది. రోజులు గడుస్తున్నకొద్దీ వాళ్ళందరినీ చూస్తున్నకొద్దీ నాకుకూడా చదువంటే శ్రద్ధ యేర్పడడం ప్రారంభించింది. మామయ్య పెద్దకొడుకు రెండవకొడుకు కూడా కుటుంబాలతో ఆ యింట్లోనే వుండేవారు. వాళ్ళ కుటుంబాల్ని చూస్తుంటే నాకు ఎంతో ముచ్చటవేసేది. ఇంట్లో అంతా చాలా నీటుగా వుండేవారు. మామయ్య మనవలకి కూడా మామయ్యంటే భయమే. ఇంట్లో ఏమీ అల్లరి చేయకుండా అతిబుద్ధిగా వుండేవారు. అదంతా మా మామయ్య నేర్పిన క్రమశిక్షణ. ఆ పిల్లలు కూడా అక్షరాలు. గుణింతాలు చదువుతూ వుండేవారు. మామయ్యగారింట్లో ఆ క్రమశిక్షణ, చదువులో గల శ్రద్ధ నాకెంతైనా నచ్చేవి. ఇంట్లో అంతమందీ ఎప్పుడూ కులాసాగా, సరదాగా కన్పించేవారు. ఇంట్లో అంతా పదిహేనుమంది వుండేవారు. అంతమంది వున్నా ఇంట్లో దేనికీ ఇబ్బంది వుండేది కాదు. ఎవరికేది కావాలన్నా వెంటనే వచ్చేసేది. అవును మరి! పెదవాడు, రెండవవాడు అమితంగా ఆర్జిస్తున్నారాయె!—లోటు యెందుకుంటుంది?—అయితే ఆ సంపాదనశక్తి వారికెలాగ వచ్చింది?—మామయ్య ఏర్పరచిన కట్టుబాట్లలో పెరిగి బుద్ధిగా చదువుకోవడంచేత, వాళ్ళని మా మామయ్య అంత పెద్ద చదువులు చదివించడంచేత."

రాజ్యం కదలకుండా కుర్చీలో కూర్చొని, రెప్పవాల్చకుండా చూస్తూ ఏదో ఆలోచిస్తోంది తనని తాను మరచి. సత్యనారాయణ చెప్పుకుపోతున్నాడు.

"నాకు క్రమంగా చదువులో ఉత్సాహం. దీక్ష జనించసాగాయి. వాళ్ళందరిలాగా చదువుకోవాలన్న పట్టుదల ఏర్పడింది. దానితో రాత్రింబవళ్ళు చదవడం ప్రారంభించాను. నా అంతట నేనే తెలియనివాటిని అడిగి తెలుసుకోడం ప్రారంభించాను. పుస్తకాలు పట్టుకొని వెళ్ళి ఎవరు తీరుబాటుగా వుంటే వాళ్ళముందు కూర్చొని ట్యూషన్ చెప్పమనేవాడిని. ఎవరికి పనిలేనప్పుడు వారు నాకు చెప్పేవారు. మా మామయ్య నాలుగో కొడుకు రోజూ ఉదయం గంట, సాయంకాలం గంట నాకు ట్యూషన్ చెప్పేవాడు. చాలా బాగా చెప్పేవాడు. ఏ రోజు కారోజు అప్పచెప్పుకొనేవాడు. మామయ్య కూడ పదిరోజులకొకసారి అన్నిటిలోను పరీక్షచేసి నా చదువెలా వుందో చూస్తుండేవాడు. ఇంటంతమందీ నా చదువు విషయంలో చాలా పట్టుదలగా వుండేవారు. ఇలాగ మామయ్య దగిర భయంచేతనైతేనేం, వాళ్ళందరిలాగా చదువుకోవాలన్న పట్టుదలవల్లనైతేనేం, వాళ్ళందరూ నాయందు చూపిన శ్రద్ధవల్లనైతేనేం బాగా చదవడం ప్రారంభించి, ఇంగ్లీషు అక్షరాలలో వున్నవాడిని, మూనాలు, ఏక్కాలు నివాడిని ఒక్క యేడాది హైస్కూల్లో మొదటి ఫారంలో ప్రవేశించడానికి వీలుగా తయారయాను. ఆ యేడే నన్ను హైస్కూల్లో జేర్చారు. నాకు ప్రవేశపరీక్షలో మంచి మార్కు లొచ్చాయి.... హైస్కూల్లో ప్రవేశించాక నాకు మరెవ్వరూ చెప్పే అవసరం లేకపోయింది. రోజూ క్లాసులో చెప్పేవన్నీ జాగ్రత్తగా విని ఇంటికి వచ్చాక చదువుకుంటూండేవాడిని నాకు అన్ని ఫస్టు మార్కు లొచ్చేవి."

"ఇలాగ ఆరు సంవత్సరాలు దీక్షగా చదివి పందొమ్మిదేళ్లు వచ్చేసరికి స్కూల్ ఫైనల్ పాసయాను. అన్నిటిలోను ఫస్టుగా మార్కులు వచ్చాయి నాకు. నేను స్కూల్ ఫైనల్ పాసవగానే నన్ను కాలేజీలో చేర్పించమని మా మామయ్య మా నాన్నగారికి ఉత్తరం వ్రాశాడు. కాని మా నాన్నగారు అంగీకరించలేదు. అక్కడ పరిస్థితులు ఏమీ బాగు లేవనీ, నేనింక ఉద్యోగంలో చేరకపోతే జరగడం కష్టం అనీ, ఇంకా చదువుతూ కూర్చుంటే అవతల ఉద్యోగానికి ఈడు మించిపోతుందనీ, అంచేత నన్ను వెంటనే పంపించేయమనీ వుత్తరం వ్రాశారు. నాకు కాలేజీలో చేరి పెద్ద చదువు చదువుకోవాలని

కోరికగా వుండేది. మా నాన్నగారు వ్రాసిన ఉత్తరం చూశాక ఆ కోరికలన్నీ అణగారిపోయాయి. నేను కాలేజీలో చదివే ఆశను వదులుకొని ఇంటికి పయనమయ్యాను. ఇంటికి వెళ్ళిన మర్నాటినుంచి ఉద్యోగప్రయత్నా లారంభించాను. కనబడిన ఖాళీ ఉద్యోగాలన్నిటికి అప్లికేషన్లు పెట్టాను. ఆఫీసులన్నీ తిరిగాను. అందరినీ ప్రార్థించాను. కాని ఫలితం లేకపోయింది. నాలుగేళ్లు ఉద్యోగం లేకుండా వున్నాను. చివరకి అనుకోకుండా ఈ ఉద్యోగం అయింది."

సత్యనారాయణ చెప్పడం ముగించాడు. రాజ్యం అచేతనంగా అలాగే ఏదో ఆలోచిస్తూ కొంతసేపు వుండిపోయింది. చివరకు అంది:

"పోనీ లెండి!—మీ మామయ్యపేరు చెప్పుకొని ఈ నాడు ఈవిధంగా నేనా బ్రతుకుతున్నాం. లేకపోతే మీరన్నట్టు మన సంసారంకూడా మీ తమ్ముడి సంసారంలాగే తయారయేదేమో!"

"నిస్సందేహంగా!— మా మామయ్య నన్నప్పుడుకాని అక్కడికి తీసుకుపోయి అంతపట్టుబట్టి చెప్పించకపోతే నాకు యేనాటికీ చదువుమీద శ్రద్ధ యేర్పడేదికాదు."

"పాపం, మీ తమ్ముడికే ఎవరు చెప్పారు కారు!"

"వాడినికూడా తీసుకొచ్చేస్తా నంటూ వుండేవాడు. నా చదువైపోయాక మా తమ్ముడిని తీసుకువద్దా మనుకుంటూ వుండగా నే మా మామయ్య హఠాత్తుగా గుండెఆగి చనిపోవడం జరిగింది. దానితో ఆ విషయంలో శ్రద్ధతీసుకున్న వాళ్లెవరూ లేకపోయారు."

"పోనీ, యింట్లో మీరుండేవారు కదా?- మీరేనా అతనికి చెప్పవలసింది!"

"నే నెంతో చెప్పేవాడిని కాని వాడు వినేవాడు కాడు; అసలువాళ్లు ఊరుకుంటున్నప్పుడు నేను చెబితే వాడికేం లక్ష్యం వుంటుంది?- నేను వాడిని గట్టిగా కోపంపడేవాడిని. వాడు నా కెదురుతిరిగేవాడు. వాడి నలాగ విచ్చలవిడిగా వదిలేస్తే ఎందుకూ కొరగాకుండాపోతాడని, కొంచెం అదుపులో వుంచండని మా నాన్నతోను అమ్మతోను శతపోరే వాడిని. మా నాన్నగారు స్వంతవిషయాలలో ఆయనకుగల అశ్రద్ధచేత, మా అమ్మ వాడిమీదగల ముద్దుచేత యేమీ అనేవారుకారు. నేను ఒక్కొక్కప్పుడు వాడిని దండించడానికి పూనుకుంటే "అంతమందీ పోనేపోయారు. వీడి నేనా బ్రతకనివ్వవుట్రా?" అంటూ నాతో దెబ్బలాడేది మా అమ్మ. వాడు చదువు మానేస్తానన్నప్పుడు నేను చాలా తీవ్రంగా పోట్లాడేను. కాని లాభం లేకపోయింది. మా నాన్న మాట్లాడలేదు. మా అమ్మ 'వాడిబాధయేదో వాడుపడతాడు. నువ్వేమీ పోషించక్కర్లేదు. వాడి నేమీ అనకు!' అంది."

"హుం!—ఆవిడన్నట్టుగా ఇప్పుడు బాధేపడుతున్నాడతను!"

"అంతే!—చిన్నప్పుడు పిల్లల్ని అదుపులో వుంచి, వాళ్ల విషయంలో శ్రద్ధవహించకపోతే ఆ పిలలు పెద్దవారయాక ఈస్థితికే వస్తారు. మా మామయ్య పిల్లల్ని చూడు!-ఇప్పుడందరూ పెద్దపెద ఉద్యోగాలలో వున్నారు. వందలకి వందలు ఆర్జిస్తున్నారు. ఎందువల్ల?-మా మామయ్య వాళ్లని చిన్నప్పట్నుంచి మంచి శిక్షణలోవుంచి పెద్ద చదువులు చెప్పించడంచేత. మళ్లీ ఆయన ఆస్తి మా ఆస్తిలో నాలుగోవంతేనా ఉండేదికాదు. ఉద్యోగంలో రాబడికూడా చెప్పుకో తగ్గంతలేదు. అయినా ఆయన అందులోనే జాగ్రత్తగా చేసుకొని పిల్లల్ని ప్రయోజకుల్ని చేశాడు. మా నాన్నగారు ఆ జాగ్రత్తే లేక హద్దుమీరిన మర్యాదలకి పోయి, అనవసరమైనవాటిని నెత్తిని వేసుకొని, గోముఖవ్యాఘ్రాలవంటివారిని నమ్మి ఆస్తినంతటినీ అప్పులవాళ్లకి అర్పించి కన్న సంతానాన్ని ఈస్థితికి తెచ్చారు."

"పాపం, శకుంతల ఇంకా చెప్పడానికి సిగుపడి దాస్తోందికాని ఇంట్లో ఒక్కొక్కరోజున ఉపవాసాలుకూడా వుంటున్నారుటండీ!"

"అవునట రాజ్యం!—నాకుకూడా ఈవార్తలొస్తున్నాయి!" విచారంగా అన్నాడు సత్యనారాయణ.

"మనం ఇంకేం చేయగలం చెప్పండి!—నెలకైన దానిలో మూడోంతుల సామాన్లు ఎప్పుడంటే అప్పుడిస్తూనే వున్నాను. ఇదికాక మీరు అయిదు పదీ ఎక్కడో అక్కడ తెచ్చి ప్రతి నెలా ఆయనకి సర్దుతూనేవున్నారు. బట్టలు లేక బాధపడుతోందని అప్పు

డప్పుడు చీర కొనుక్కోమని ఇస్తున్నాను. ఇంతకంటే సాయపడడానికి మన ఆదాయం మాత్రం యెంత చెప్పండి!" అంది రాజ్యం భర్త ముఖంలోకి చూస్తూ.

"నిజమే రాజ్యం!" అన్నాడు సత్యనారాయణ ఏదో ఆలోచిస్తూ. కొంతసేపు ఊరుకొని మళ్లీ అన్నాడు.

"ఆపిల్ల ఇక్కడుండేకంటే వాళ్లన్నగారింటికి వెళిపోయి కొంతకాలం అక్కడుంటే మంచిదని పిస్తున్నది!

అక్కడికి వెళితేమాత్రం యేం సుఖపడిపోవాలి ఆ ఒదినగారు నానా కాల్పులు కాల్చి వేధిస్తుంది!"

"అప్పులవాళ్లు ఇంటి నొదలకుండా తిరుగుతున్నారట. వాళ్ళందరిని తప్పించుకుంటూ వీడు కనబడకుండా తిరుగుతున్నాడట. వాళ్లంతా వీడెక్కడ కనబడనా తంతాం అంటున్నారట."

"అయ్యయో! వాళ్లతో మీరేనా చెప్పాగు కారండీ?" అని అడిగింది రాజ్యం.

"చెబితే మాత్రం ఎంతకాలం ఊరుకుంటారు రాజ్యం. మాసాలు, సంవత్సరం అయినా దమ్మిడీ కూడా తీర్చకుండా వుంటే?" అన్నాడు సత్యనారాయణ.

"వెధవలు అన్నంత పనీ చేస్తారేమిటో?" అంది రాజ్యం భయంగా.

"అయినా మనం ఏం చేయగలం రాజ్యం?— అప్పటికీ నేను చెబుతూనే వున్నాను వాళ్లితో!" అన్నాడు సత్యనార యణ విచారంగా.

"ప్చ్" అంది రాజ్యం భారంగా.

వారంరోజులు గడిచాయి. శకుంతల ఈవారం రోజులనుంచీ రాలేదు.

ఆవేళ సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికొస్తూనే, "శకుంతలొచ్చిందా?" అని అడిగాడు సత్యనారాయణ భార్యని.

"ఆవేళనుంచి మరి రాలేదండీ!" అన్నది రాజ్యం.

"రాకపోతే నువ్వేనా వెళ్లి కనుక్కోవద్దుటే ఏమిబ్బందులు పడుతున్నారో యేమిటోను?" అన్నాడు సత్యనారాయణ.

"నాలుగురోజుల క్రింటట వెళ్లాను కదుటండీ?" అంది రాజ్యం.

"అప్పుడు వెళితే సరా?—వాళ్లి పరిస్థితులు బాగులేనప్పుడు ఎలా వుంటున్నారో కనుక్కుంటూ వుండొద్దూ మనంవుండి?" అన్నాడు సత్యనారాయణ.

"ఇంకా మరెలాగ కనుక్కోడమండీ?" అన్నది రాజ్యం.

"అదికాదు రాజ్యం, వాళ్ల పరిస్థితి మరీ ప్రమాదకరంగా వుంది. ఇవాళ పొద్దున్న ఎవడో అప్పులవాడు ఇంట్లో కూడా చొంబడి మాతిమ్మడిని తన్నపోతే శకుంతల గోలపెట్టగా ఇరుగుపొరుగులవాళ్లొచ్చి దెబ్బలాడి బయటికి పంపించేశారట వాడిని.

"ఇది మీకెవరు చెప్పేరు?"

"మా ఆఫీసులో పనిచేస్తున్న గుమస్తా ఒకడు ఆవీధిలోనే వుంటున్నాడు. వాడు చెప్పాడు. నేను వెళ్లి కనుక్కుందామంటే ఈ ఆఫీసుపనివల్ల అవకాశం లేకుండా వుంది. అదీ కాకుండా ఆపిల్లకి నాదగ్గర ఊరంత మొహమాటం!"

"బాగుంది!" అన్నది రాజ్యం.

"ఒకసారివెళ్ళి కనుక్కొని వచ్చేదాం రాకూడదూ?" అని అడిగాడు సత్యనారాయణ.

"ఇప్పుడా?" అంది రాజ్యం బద్ధకంగా.

ఏం?—రిక్షాలోవెళ్ళి మళ్ళీ అరగంటలో వచ్చేద్దాం!" అన్నాడు సత్యనారాయణ. రాజ్యం నిముషం ఆలోచించి, "అయితే అలాగే!" అంది.

"ఉండు. నేను రెండు నిముషాల్లో మొహం కడుక్కొనొచ్చేస్తాను!" అంటూ సత్యనారాయణ డ్రస్సు విప్పి లుంగీకట్టుకొని తువ్వాలు, సబ్బుపెట్టె పట్టుకొని బాత్ రూంలోకి వెళ్లాడు.

ఇంతలో వీధి తలుపు దభీమని తోసుకొని ఒక పదిహేనేళ్ళ కుర్రవాడు గాభరాపడుతూ లోపలికొచ్చి, "ఏమండీ, శకుంతల ఒంటిమీద కిరసనాయిల్ పోసుకొని నిప్పంటించుకుంది. చాలా ప్రమాదంగా వుంది. మిమ్మల్ని వేగంగా రమ్మంటున్నారండీ!" అని చెప్పాడు. ఈ మాట వినగానే రాజ్యం" ఆఁ!" అంటూ అలాగే మ్రాన్పడి నిల్చుండిపోయింది. ప్రక్కనున్న బాత్ రూంలోవున్న సత్యనారాయణ ఈ మాట వినగానే సగం సగం మొహం కడుక్కుంటూన్న

చిన్న సంసారం

వాడూ గభీమని బయటకువచ్చి "ఏమిటి?" అని అడిగాడు.

"శకుంతల ఒంటికి నిప్పంటించుకుందటండీ!" అంది రాజ్యం.

"అవునండీ, ఇప్పుడే అరగంట క్రిందట, మంటలార్పి పడుకోబెట్టారు. చాల ప్రమాదంగా వుంది. మా నాన్నగారు ఇంజక్షనులిస్తున్నారు." అన్నాడు వచ్చిన కుర్రాడు.

"మీ నాన్నగారెవరు"?

"డాక్టరు కామేశ్వరరావుగారండీ!"

వెంటనే సత్యనారాయణ లాల్చీ వేసుకొని వీధిలో పోతున్న రిక్షాని పిలిచాడు. అతను, భార్య వెంటనే రిక్షాలో బయల్దేరారు.

అయిదు నిముషాలలో రిక్షావెళ్లి ఆ యింటి ముందు ఆగింది. సత్యనారాయణ, రాజ్యం రిక్షా దిగి లోనికి వెళ్లారు. కాని అప్పటికే శకుంతలచనిపోయింది. ఆమె మృతదేహం మంచంమీద పడివుంది. వారిద్దరు వెళ్ళేసరికి ఇంట్లో ఇసకవేస్తేరాలనంతమంది జనం చుట్టివేసివున్నారు. శకుంతల దేహాన్ని చూసి సత్యనారాయణ దుఃఖంతో అలాగే మ్రాన్పడిపోయాడు. ఆమె దేహం చాలాచోట్ల కాలిపోయి ఎర్రగా కన్పిస్తూన్న మాంసంతో భయంకరంగా వుంది. ముఖం పూర్తిగా కాలిపోయి వికృతంగా వుంది. రాజ్యం చూడగానే కెవ్వుమని అరచి భయంతో కళ్ళుమూసుకుంది.

శకుంతల మృతదేహంవున్న మంచం ప్రక్కనే చిన్న అల్మైరా వుంది. ఆ అల్మైరాలో చిన్నహరికేన్ లాంతరు వుంది. ఆ లాంతరులోని కిరసనాయిలే ఒంటిమీద ఒంపుకుంది శకుంతల. ఆ లాంతరు క్రింద ఒక ఉత్తరం కన్పించింది సత్యనారాయణకి. అతనా ఉత్తరం తీసి చూశాడు. అది తన తమ్ముడు భార్యకి వ్రాసిన ఉత్తరం. అందులో ఇలాగ వ్రాసి వుంది.

శకుంతలా!

నువ్వు ఈ ఉత్తరం చూసేసరికి నేనిల్లు వదలి చాలా దూరం పోయివుంటాను. నేనిలాగ నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతూన్నందుకు నామీద నీకు చాలా కోపం రావచ్చు. అసలు నాకుకూడా నిన్నొదిలి వెళ్లడం ఇష్టంలేదు. కాని ఏంచేసేది?-పరిస్థితులిలాగ వచ్చాయి. నాకొచ్చిన జీతం మనిద్దరికి పదిహేను రోజులకి మాత్రమే సరిపోతోంది. తక్కిన పదిహేనురోజులు నువ్వు ఎవ్వరింటేనా అడిగితెచ్చిన నాడు తినడం లేని నాడు ఉపవాసాలుండడం జరుగుతోంది. ఊళ్లో ఎవ్వరూ అప్పుకాని, అరువుకాని ఇవ్వకుండా వున్నారు నాకు. ఈ పరిస్తితులలో మనం ఎంతకాలం సంసారం సాగించగలం?—ఏమిటో శకుంతలా!—రానురాను బ్రతుకంటేనే రోత పుడుతోంది. మా అన్నయ్యలాగ చిన్నప్పుడు చదువుకొనివుంటే ఇప్పుడిన్ని బాధలు లేకపోయేవేమో!—కాని అప్పుడేమిటో చిన్నతనంవల్ల ఇవన్నీ తెలియక చదువుకోకుండా తిరిగాను. మాఅమ్మా నాన్నా అయినా అప్పుడు శ్రద్ధ వహించి గట్టిగా చెప్పారు కారు. కాని ఇప్పుడవన్నీ తల్చుకొని విచారిస్తే యేం లాభం? అయితే ఇప్పుడు రెండు సమస్యలు నన్ను బాధిస్తున్నాయ్. మొదటిది సంసారం ఇంక ఎలాగ వెళుతుందా అన్నది, రెండవది అప్పులవాళ్లబాధ. ఇప్పుడు మొదటిబాధకంటే రెండవ బాధే అధికంగావుంది. ఎక్కడికి వెళ్ళినా ఈఅప్పులవాళ్లు నాప్రాణాలు పీకేస్తున్నారు చివరికి ఇంట్లో కూడా చొరబడి చేయిచేసుకోడానికి తయారవుతున్నారు. ఇందువల్ల కొంతకాలం ఎటేనా తిరిగితే ఈబాధలు తప్పుతాయన్న ఉద్దేశంతోను, ఇంతకంటే మంచి ఉద్యోగం దొరుకుతుందేమో అన్న ఆశతోను ఇల్లువిడిచి పోతున్నాను. ఎటు పోతున్నానో మాత్రం ఇప్పుడు చెప్పలేను. అసలు ఎటుపోవడమో నాకే తెలియడంలేదు. నాగురించి నువ్వు మరేమీ విచారించకు. నేనుండిమాత్రం నిన్నేం సుఖపెట్టేను?—ఇలాగ నలభై రూపాయిల జీతం తెచ్చుకుంటూ ఇక మీదట మాత్రం యేం సుఖపెట్టగలను?—అంచేత నువ్వు మరి విచారించకుండా మీ అన్నయ్య వద్దకు వెళ్ళిపో!—మనరోజులు బాగుండి ఏనాటికేనా ఈ దారిద్ర్యం వదిలితే తిరిగి కలుసుకుందాం!—

శేషగిరి.